క్లుప్తంగా

కెనాల్‌కు ఇరువైపులా మొక్కలు నాటాలి



పరిశీలిస్తున్న సీఆర్‌డీ టీం సభ్యులు

సుల్తానాబాద్‌రూరల్:ఎస్సారెస్పీ కెనాల్‌కు ఇరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కమిషనరేట్ రూరల్ డెవలప్‌మెంట్(సీఆర్‌డీ) రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ నర్సింహారావు, రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ రఘువీర్ అన్నారు. మండలంలోని గట్టెపల్లి, సుద్దాల, చిన్నబొంకూర్, చిన్నకల్వల గ్రామాల్లో నాటిన మొక్కలను శనివారం సీఆర్‌డీ టీం సభ్యులు, డీఆర్‌డీఏ శ్రీధర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు మాట్లాడుతూ హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. వారి వెంట ఎంపీడీవో శశికళ, ఎంపీవో లావణ్య, తదితరులున్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలపల్లి: బీసీలకు చట్ట సభల్లో యాభై శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టాలని జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. వచ్చేనెల 3,4 తేదీల్లో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య సారథ్యంలో జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నా 'చలో పోస్టర్' ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు జెట్టి సతీశ్, నాయకులు దండె వెంకటేశం, శాతల్ల కాంతయ్య, బొద్దుల సాయినాథ్, కనుకయ్య, వేల్పుల లింగయ్య, రంగు శేఖర్,రాయనవేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో ధనలక్ష్మీ పూజ



ధనలక్ష్మీపూజలో పాల్గొన్న జీఎంలు

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల పరిధి సెంటినరీకాలనీ జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో శనివారం ఆర్జీ3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు, ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు ధనలక్ష్మీ పూజ నిర్వహించారు. 2023–2024 ఆర్థిక సంవత్సరం ప్రారంభము సందర్భంగా పూజ చేశారు. కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్స్) పి.శ్రీనివాసులు, డీజీఎం(ఐఈడీ) కే.చంద్రశేఖర్, డీజీఎం(పర్సనల్) విలాస్ శ్రీనివాస్ పోద్దార్, డీజీఎం(పారెస్ట్రీ)కర్ణ, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులకు అందని సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న రమేశ్

యైటింక్లయిన్‌కాలనీ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ అన్నారు. శనివారం యైటింక్లయిన్ కాలనీ ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. 15 ఏళ్ల క్రితం ఉన్న రాష్ట్రం అలాగే ఉందని ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. రామగుండం నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి బస్తీ, పల్లె బాట చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు అందజేస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ కృషి చేస్తుందన్నారు. నాయకులు తిరుపతి,సాయి తేజ, సంతోష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల:పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపులలో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయా గ్రామాల మీదుగా జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్ వైపునకు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

భళా.. హస్తకళ..



ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళ స్టాల్స్

- 'ఖని'లో చేనేత, హస్తకళల ఉత్పత్తుల విక్రయం
- మనస్సును హత్తుకుంటున్న స్టాల్స్
- ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల హ్యాండ్ లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్
- కొనుగోలుదారుల్లో పెరిగిన ఆసక్తి

కోల్‌సిటీ: 'ఒక్కో పోగునూ నేతన్నలు నేర్పుగా కూరిస్తే... చిలకపచ్చ రంగు సింగారించుకున్న చీరలు... చూపు తిప్పనివ్వని డిజైన్లతో నేసిన చేతి రుమాళ్లు...అందం రెట్టింపు చేసే అలంకరణ సామగ్రి... ఆరోగ్యాన్ని పంచే ఆయుర్వేద మందులు.. జూట్ బ్యాగులు... ఇలా అనేక ఉత్పత్తులు గోదావరిఖనిలో నిర్వహిస్తున్న చేనేత, హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శన స్వాగతం పలుకుతున్నాయి. దేశ సంస్కృతిలో అంతర్భాగమైన చేనేతలు, హస్తకళల జీవన సౌందర్యానికి ప్రతీకలు. అందం.. హుందాతనం.. కలగలిపిన చేనేత వస్త్రంపై మనసు పడని మగువలెవరూ ఉండరు. ఆధునిక సొబగులద్దుకుంటున్న సంప్రదాయ కళను రామగుండం నగరవాసులకు చేరువ చేసేందుకు గోదావరిఖని జీఎం కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో చేనేత, హస్తకళల ప్రదర్శన, అమ్మకాల స్టాల్స్‌ను 'శ్రీఉషోదయ చేనేత హస్తకళా సొసైటీ'ఏర్పాటు చేసింది. నేతన్నలకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఈ సొసైటీ కృషి చేస్తోంది.

ఆకట్టుకునే పలు రాష్ట్రాల ఉత్పత్తులు...

చేనేత, హస్తకళ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన 50 వరకు హ్యాండ్ లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు స్వయంగా తయారు చేసిన తయారు చేసిన ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు పెట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్నాటక, జైపూర్, ఢిల్లీ, వెస్ట్‌బెంగాల్ తదితర రాష్ట్రాల్లోని హ్యాండీ క్రాఫ్ట్స్, హ్యాండ్ లూమ్స్ ఆకట్టుకుంటున్నాయి.

చేనేత వస్త్రాలకు పెరిగిన ఆదరణ...



చేనేత మేళాను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రస్తుతం చేనేత వస్త్రాలకు ఆదరణ పెరిగింది. పోచంపల్లి, నారాయణ్‌పేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కళంకారి కాటం చీరలు, ఫ్యాన్సీఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంతావర్క్ కాటన్, బాంధనిసిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్, డోర్ కర్టన్స్, డోర్ మ్యాట్స్, వరంగల్ టవల్స్, లుంగీలు, బెడ్ షీట్స్, మాస్కులు, రాజస్థాన్ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ టాప్స్, జైపూర్ బెడ్‌షీట్స్, ఖాదీ వస్త్రాలతోపాటు గోల్డ్ కవరింగ్ ఆభరణాలు, అప్పడాలు, వడియాలు, పూతరేకులు, న్యూట్రిషన్ ఫుడ్, 1గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీస్, జ్యూట్ బ్యాగులు తదితర హస్తకళా వస్తువులను విక్రయిస్తున్నారు.

హస్తకళలను ప్రోత్సహించండి



హ్యాండ్‌లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్ కళాకారులను ప్రజలు ఆదుకోవాలి. చేనేత వస్త్రాలు, హస్తకళలను ప్రోత్సహించి కొనుగోలు చేయాలి. ఉషోదయ సొసైటీ ద్వారా కళాకారులను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించి భరోసా కల్పిస్తున్నాం. 'మనం బతుకుతూ.. మరో పదిమందిని బతికించుకుందాం..'అనే నినాదంతో నేతన్నలకు ఆర్థికంగా చేయూతను అందించడానికి కృషి చేస్తున్నాం. గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు, అమ్మకాలు ఏప్రిల్ 9 వరకు నిర్వహిస్తాం. – కిశోర్, హస్తకళ సొసైటీ అధ్యక్షుడు

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు అండ

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు అండ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం స్థానిక కల్యాణ్‌నగర్ లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాల్సిన బాధ్యత ముఖ్య కార్యకర్తలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందన్నారు. మొక్కుబడిగా పర్యటనలు, సమావేశం నిర్వహిస్తున్న విపక్షాల నాయకులను ప్రతి ఒక్కరు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దీనికి ముందు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, కార్పొరేటర్లు బాలరాజ్‌కుమార్, అయిత శివ, అడ్డాల స్వరూప, ధరణి స్వరూప, జనగామ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఆత్మరక్షణకు కరాటే ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శనివారం కాలనీలోని పాలకుర్తి కేజీబీవీలో నిర్వహించిన బాలికల సెల్ఫ్ డిఫెన్స్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నెల రోజుల పాటు కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు చేసిన కరాటే విన్యాసాలను ఎమ్మెల్యే చందర్ వీక్షించి, విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ రామస్వామి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వో స్వరూప, కార్పొరేటర్లు సాగంటి శంకర్, అంజలీదేవి, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాలతో చర్చలు జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం చేతకాకపోతే ప్రస్తుతం ఉన్న సంఘాలను రద్దు చేసి అన్ని కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఆరేళ్లయ్యిందని, కాలపరిమితి ముగిసి నాలుగేళ్లు గడిచిందన్నారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ అనేక దఫాలుగా పోరాటాలు చేసి, చివరికి హైకోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. ఏప్రిల్ 2న తిరిగి అన్ని సంఘాలతో ఆర్‌ఎల్‌సీ సమావేశం ఏర్పాటు చేశారని, ఈలోపు యాజమాన్యం ప్రొడక్షన్ పీరియడ్ పేరుతో ఎన్నికలు రెండు నెలలు వాయిదా వేయాలని కోర్టుకు వెళ్లడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. దీన్ని బట్టి సింగరేణి యాజమాన్యానికి ఎన్నికలంటే ఇష్టం లేదన్నారు. ఎన్నికలు సకాలంలో నిర్వహించకుంటే అన్ని సంఘాలతో కలిసి సమ్మె నోటీసు ఇస్తామన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్షల నిర్వహణపై చర్చిస్తున్న అధికారులు

రామగిరి/కమాన్‌పూర్/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/ధర్మారం/ఎలిగేడు/ఓదెల/సుల్తానాబాద్: రేపటి నుంచి జరగనున్న పదో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు తెలిపారు. సెంటర్లలో హాల్ నంబర్లు వేస్తున్నారు. విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుటుంన్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. 9 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇస్తారని, 9.35 తరువాత పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని ఎంఈవోలు పేర్కొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

గోదావరిఖనిటౌన్: ఈనెల 3 నుంచి జరిగే 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించి, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. 10 వ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కోరారు. విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే విద్యార్థులు ఫోన్ 9177364326,9398412161 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఓదెల:సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పొత్కపల్లి ఎస్సై మహేందర్ అన్నారు. మండలంలోని ఇందుర్తి, హరిపురం గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాల్యవివాహాలు , సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లలో ఆధార్‌నెంబర్, ఓటీపీ వివరాలను ఎవరికి చెప్పవద్దన్నారు. బాల్యవివాహాలను చేయరాదని , మూఢ నమ్మకాలను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

ముస్లింలకు రైల్వే ఉన్నతాధికారి ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో రైల్వే అధికారి,ఆర్‌పీఎఫ్ సీఐలు

రామగుండం: రంజాన్ ఉపవాస దీక్షల్లో భాగంగా శనివారం స్థానిక రైల్వేస్టేషన్ రామాలయ ప్రాంగణంలో ముస్లింలకు రైల్వే ఉన్నతాధికారి రాంబాబు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్, కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, అజ్మీరా వీరన్న నాయక్, రామారావు, రైల్వే కాంట్రాక్టర్ ఎండీ.ఆరీఫ్, మత పెద్దలు హాజరయ్యారు.

అభివృద్ధి ఓర్వలేక ఆరోపణలు

ఎలిగేడు: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ మండిక రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. విజయ రమణారావు ఆరోపణలు నిజం లేదనన్నారు. ఉద్యమం చేస్తేనే పోలీస్‌స్టేషన్ వచ్చిందని చెప్పుకోవడానికి దొంగ దీక్షలు చేస్తున్నావన్నారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ఏం అభివృద్ధి చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ప్రజలే గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పరిశీలన

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాలోని అబ్దుల్‌కలాం స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌ను జీఎం ఎ.మనోహర్ శనివారం పరిశీలించారు. అలాగే సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఉన్న స్విమ్మింగ్ పూల్ పరిశీలించి సాధ్యమైనంత త్వరగా వినియోగంలోకి తీసుకరావాలని సూచించారు. జీఎం వెంట ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌ఓటూ జీఎం సలీం, అధికార ప్రతినిధి జి.రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, సీనియర్ పర్సనల్ అధికారి వేణుగోపాల్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ, తదితరులున్నారు.

బ్యాంకులకన్నా పోస్టాఫీస్‌ల్లో అధిక వడ్డీ

గోదావరిఖనిటౌన్: పోస్టాఫీసుల్లో బ్యాంకుల కంటే 4 శాతం అధికంగా వడ్డీ రేట్లు పెరిగినట్లు శనివారం గోదావరిఖని తపాల శాఖ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. పలు పోస్టల్ పథకాలపై వడ్డీ రేట్లు0.1శాతం నుండి 0.7వరకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. వడ్డీ రేట్ల పెరుగుదల చిన్న పొదుపుదార్లకు మేలు చేకూరుతాయని, మహిళలకు కొత్తగా ఎక్కువ వడ్డీతో మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీం ప్రారంభించినట్లు తెలిపారు. వృద్ధులకు సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం నుందు పెట్టుబడి రూ.30 లక్షల వరకు పెంపు జరిగిందని, మంత్లీ ఇన్‌కం స్కీం నందు పెట్టుబడి సింగిల్ ఖాతాకి రూ.9 లక్షలు, ఉమ్మడి ఖాతాకు రూ.15లక్షల వరకు పెంచినట్లు పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని ప్రజలందరు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా కొత్త ఖాతాల ప్రారంభం, పాత సేవింగ్స్ ఖాతాల పునరుద్ధరణకు ఈనెల 30వ తేదీవరకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

కనుల పండువగా శ్రీసీతారాముల పట్టాభిషేకం



పట్టాభిషేకానికి వచ్చిన భక్తులు

మంథని: పట్టణంలోని శ్రీరాంనగర్‌లో సీతారాముల పట్టాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేక ఊయలలో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి అందంగా అలంకరించారు. కాలనీకి చెందిన మహిళలు సీతారామచంద్రులకు పలు రకాల స్వీట్లు, పూలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసారు. సీతారాముల కల్యాణం రెండో రోజు ఇక్కడి పట్టాభిషేకం నిర్వహిస్తారు. మరో విశేషమేమిటంటే పట్టాభిషేకం నాడు రాములవారు ఇక్కడికి వచ్చి వెళ్తాడని భక్తుల విశ్వాసం, కాగా స్వామి వారి ఊయల ముందర వరిపిండిని వేసి ఆలయ పూజారి ఆలయానికి తాళం వేసుకొని ఇంటికి వెళ్తారు. మరుసటి రోజు ఆ వరిపిండిపై పాదాల ముద్రలు దర్శనమిస్తాయి. అవి స్వామివారి పాదాలేనని ఈ ప్రాంత వాసుల నమ్మకం. గత కొన్నేళ్లుగా ఇక్కడ ప్రజల విశ్వాసం.

'అంతర్గత పోరుతో జేబీసీసీఐ సమావేశం జాప్యం'

రామగిరి: ఐఎన్టీయూసీలో నెలకొన్న అంతర్గత పోరు, కోర్టు కేసుల కారణంగానే జేబీసీసీఐ 9వ సమావేశం జాప్యం జరుగుతుందని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్)ఆర్జీ3, ఏపీఏ ఏరియా ఉపాధ్యక్షుడు అరుకాల ప్రసాద్ ఆరోపించారు. సెంటినరీకాలనీలోని యూనియన్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. 11వ వేజ్ బోర్డు అలవెన్సుల ఫ్రీజ్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన ఖండించారు. 19 శాతం మినిమం గ్యారెంటెడ్ బెనిఫిట్ ఒప్పందం కుదిరిందని, దీనిపై అలవెన్సులపై ఫ్రిజ్ ను కొనసాగిండానికి ఒప్పుకున్నారని హెచ్‌ఎంఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని కార్మికులు నమ్మవద్దని, తప్పుడు ప్రచారం చేస్తున్న కార్మిక నాయకులను ప్రశ్నించాలని కోరారు. జేబీసీసీ 11వ వేతన సవరణ కమిటీ చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌పై కొనసాగుతున్న అలవెన్సులపై ఫ్రీజ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేయగా ఇప్పటివరకు అలవెన్సులపై ఏలాంటి చర్చ జరగకముందే అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. బీఎంఎస్ జాతీయ నాయకులు ఇచ్చిన పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 19, 20, 21న భూగర్భ గనులు, ఓపెన్ కాస్టులు, డిపార్ట్‌మెంటులపైన గేట్ మీటింగ్‌లు, నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి కోలిండియా, సింగరేణి యాజమాన్యాలు దిగి వచ్చే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ నెలలో తదుపరి జేబీసీసీఐ 9వ సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు. సమావేశంలో ఆసంఘం కార్యదర్శి మామిడి స్వామి పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలి



అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు ఈనెల 1నుంచి 14 వరకు నిర్వహించనున్న బాబు జగ్జీవన్‌రావు, మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం కాలనీ, పోతనకాలనీ ఏరియాలలోని అంబేద్కర్ విగ్రహాలను శుభ్రం చేసి క్షీరాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం పెద్దపల్లి జిలా కో–కన్వీనర్ ఆకునూరి బాల అంకూస్, సింగరేణి కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, చంద్రమౌళి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

జ్యోతినగర్: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ నెల 14 వరకు మహనీయుల జయంతి వారోత్సవంలో భాగంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మూడో డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఎన్టీపీసీ రామగుండం పట్టణ అధ్యక్షుడు శేఖర్, పెగడపల్లి నారాయణ, ఎర్రోళ్ల కుమారస్వామి, ఈదునూరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

భూ పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

మంథని: భూ పోరాటంలో భాగంగా భూపాలపల్లి జిల్లా కేంద్రం నుంచి గోదావరిఖని వెళ్తున్న భూ పోరాట కమిటీకి మంథనిలో సీపీఎం నాయకులు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. మంథని ప్రధానచౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో అనేక ప్రాంతాల్లో భూమిలేని నిరుపేదలకు గుడిసెలు వేసి భూ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. నాయకులు ఆర్ల సందీప్, పోలం రాజేందర్, బావు రవి, శ్రీకాంత్, కోమల శ్యావ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం మరమ్మతుకు విరాళం

రామగిరి: మండలంలోని రత్నాపూర్ శ్రీ కోదండ రామాలయం ధ్వజస్తంభం మరమ్మతుకు పలువురు దాతలు విరాళం అందించారు. గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి కొప్పుల పురుషోత్తమరావు, సత్య భూషణం దంపతులు రూ.25 వేలు, పల్లెవాడకు చెందిన మేకల ఓదేలు, లక్ష్మి దంపతులు రూ.25 వేలు విరాళం అందించినట్లు సర్పంచ్ పల్లె ప్రతిమ తెలిపారు.

చెక్కు అందజేత

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామానికి చెందిన రంగు లచ్చయ్యగౌడ్ అనే గీత కార్మికుడు ఫిబ్రవరి 18వ తేదీన ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందాడు. బాధిత కుటుంబానికి బీసీ కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.25వేలు పరిహారం చెక్కును జెడ్పీటీసీ ఆముల నారాయణ శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్న రాష్ట్ర అధ్యక్షుడు సింగం సత్తయ్యగౌడ్, సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు బండి మహేష్‌గౌడ్, బీసీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ రమేశ్ తదితరులున్నారు.

పెద్దపల్లి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా దాడి సంతోష్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన దాడి సంతోష్‌ను నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జిగా నియమించారు. సంతోష్ గతంలో ఏబీవీపీ నాయకుడిగా, యువమోర్చా ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. పెద్దపల్లి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్‌లకు సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడిగా రవీందర్ రెడ్డి

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ ఏరియా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడిగా కోట రవీందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. రవీందర్ రెడ్డి వరుసగా మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. తన ఎన్నికకు సహకరించిన బ్రాంచి ముఖ్య కార్యకర్తలకు, నాయకులు, సింగరేణి కార్మికులకు రవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.

రేపు కూరగాయల వారసంత వేలం

ధర్మారం: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతకు ఈ నెల 3న వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌బాబు తెలిపారు. కూరగాయల సంత కోసం వేలం పాటలో పాల్గొను వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. వేలంలో నెగ్గిన వ్యక్తి అదే రోజు పాటలో 50 శాతం డబ్బులు చెల్లించాలని పేర్కొన్నారు. వేలం పాటను సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, ఎంపీవో రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు, ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

4న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

కోల్‌సిటీ: శారీరక దివ్యాంగులు, సహాయ అవయవ ఉపకరణాల పంపిణీ శిబిరం ఈనెల 4వ తేదీన మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్లు శనివారం జిల్లా సంక్షేమాధికారి రౌవూఫ్ ఖాన్ తెలిపారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు తమ సదెరం ధృవీకరణపత్రం, ప్రతీ నెల 15వేల లోపు ఆదాయం ధృవీకరణపత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు తదితర పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని ఆదర్శ విద్యా విహార్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులకు హృదయ భారతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థపకురాలు మంగళ మక్కపాటి ఆదేశాల మేరకు సంస్థ ప్రతినిధి అరుణ కుర్చీలను సమకూర్చగా, శనివారం సర్పంచ్ వీరగోని సుజాత విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పులి అనూష, సింగిల్ విండో మాజీ చైర్మన్ కల్లెపల్లి జాని, పులి వెంకటేశం, కరస్పాండెంట్ అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.